క్లుప్తంగా

సేవలకు ముస్తాబు



ఇంజేడులో పూర్తయిన సచివాలయ భవనం

ఉయ్యాలవాడ: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సచివాలయాల ద్వారా సాకారం అవుతోంది. మండలంలోని ఇంజేడు గ్రామంలో రూ. 42 లక్షలతో చేపట్టిన సచివాలయ భవనం ప్రారంభానికి ముస్తాబైంది. ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పల్లెకు చేరిన ఆధునిక వైద్యం



మందులను అందజేస్తున్న ఎంపీడీఓ, వైద్యులు

దొర్నిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఆధునిక వైద్యం పల్లెకు చేరిందని ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం బుర్రారెడ్డిపల్లె గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమంలో వైద్యులు రుహుల్లాఖాన్, సోమశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి 465 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, సచివాలయ కన్వీనర్ శ్రీపతి ప్రసాద్, వైస్‌ప్రెసిడెంట్ బాలసుబ్బయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

నంద్యాల(సిటీ): మున్సిపల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ సభ్యులు మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసాను కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. కార్మికులు రంజిత్‌కుమార్, ప్రతాప్, చిన్నమ్మ తదితరులు ఉన్నారు.

463 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

రుద్రవరం: మండల కేంద్రంలోని సచివాలయం–1 పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 463 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి బాబు తెలిపారు. ఉచితంగా మందులు అందజేసినట్లు చెప్పారు. గ్రామాల్లో నిర్వహించే ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యులు ప్రశాంత్, శివాని తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న జీసీడీఓ

రుద్రవరం: ప్రణాళికతో చదివితే పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని జీసీడీఓ సువచ్చల అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. వసతులు, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థినుల సామర్థ్యాలను పరీక్షించారు. బాగా చదువుకుని మంచి పేరు తెచ్చుకోవాలని విద్యార్థినులకు సూచించారు. ఆమె వెంట ప్రిన్సిపల్ లక్ష్మీదేవి ఉన్నారు.

ఆళ్లగడ్డ డీఎస్పీగా షర్ఫుద్దీన్

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ డీఎస్పీగా షర్ఫుద్దీన్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పల్నాడులో డీఎస్పీగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి రానున్నారు. ఇక్కడ ఉన్న సుధాకర్‌రెడ్డిని డీఎస్పీ, ఏసీబీ అండ్ అటాచ్ ఎస్పీకి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రుణాలను రెన్యూవల్ చేసుకోండి

శిరివెళ్ల: వ్యవసాయ సహకార సంఘాల ద్వారా తీసుకున్న పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని శిరివెళ్ల, బోయలకుంట్ల సహకార సంఘాల చైర్మన్లు రాజశేఖరరెడ్డి, సీఈఓలు మహబూబ్‌బేగ్, దస్తగిరి తెలిపారు. మార్చిలోగా 7 శాతం వడ్డీతో రెన్యూవల్ చేయించుకుంటే వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. 12 శాతం అపరాదపు వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఆహా ఏమి రుచి

- ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు నచ్చేలా మధ్యాహ్న భోజనం
- అదనంగా రాగి జావ, చిక్కీలు
- మినరల్ వాటర్ ఏర్పాటు
- ఇష్టంగా ఆరగిస్తున్న విద్యార్థులు

రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలను తీసుకొచ్చారు. అమ్మ ఒడి, మనబడి, నాడు–నేడు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, డిజిటల్ విద్య, జగనన్న విద్యాకానుక వంటి పథకాలు ఉన్నాయి. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా వసతులు కల్పించి సర్కారు బడులను బలోపేతం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా మధ్యాహ్న భోజనంలో కొత్త మెనూ అమలు చేస్తున్నారు.

గోస్పాడు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యార్థులకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో జగనన్న గోరు ముద్ద పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ పథకం ఎంతగానో ఊరటనిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో మధ్యాహ్నం భోజనం సరిగ్గా లేకపోవడంతో చాలా మంది ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకునేవారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెనూలో మార్పులు తీసుకురావడంతో పాటు రుచికరంగా ఆహారం అందిస్తుండడంతో విద్యార్థులు బడిలోనే ఇష్టంగా భోజనం చేస్తున్నారు.

అనేక మార్పులు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల భోజన సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనం మెనులో చాలా మార్పులు చేసింది. విద్యార్థులకు ఆరోగ్య రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో నాణ్యమైన మెనూ అమలు చేసేలా ఆహార పదార్థాలను అందిస్తోంది. గతంలో పప్పు, సాంబారు, రసం, ఆకుకూరలు వంటి ఆహార పదార్థాలు అంతంత మాత్రంగానే ఉండేవి. అంతేకాకుండా వారానికి రెండు గుడ్లు మాత్రమే అందించేవారు. ప్రస్తుతం శనివారం మినహా ప్రతిరోజు ఉడికించిన గుడ్డు అందించేలా ఏర్పాటు చేశారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలను అందిస్తూనే సోమ, బుధ, శుక్రవారాల్లో ప్రతి విద్యార్థికి చిక్కి, మంగళ, గురు, శనివారాల్లో ఉదయం 11 గంటలకు రాగి జావ అందిస్తున్నారు. శనివారం మాత్రం మధ్యాహ్న భోజనంతో పాటు ప్రత్యేకంగా స్వీట్ పొంగలిని అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యానికి రక్షణ కల్పిస్తున్నారు. ప్రతి రోజూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వెళ్లి పరిశీలించిన అనంతరమే విద్యార్థులకు భోజనాలు అందజేస్తారు.



భోజనాలు చేస్తున్న విద్యార్థులు

తాజాగా ఉండేలా గుడ్ల సరఫరా

విద్యార్థులకు అందించే గుడ్లు తాజాగా ఉండేందుకు ఎప్పటికప్పుడు వారానికోసారి చొప్పున నెలకు నాలుగు సార్లు గుడ్లను సరఫరా చేస్తున్నారు. గతంలో ఏజెన్సీల నిర్వాహకులు ఎప్పుడు పడితే అప్పుడు అందజేస్తూ రోజుల తరబడి నిల్వ ఉండడంతో ఒక్కోసారి గుడ్లు చెడిపోయేవి. అయితే ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలలకు అవసరమైన గుడ్లను ఏ వారానికి ఆ వారం ఒక్కో విద్యార్థికి వారానికి ఐదుగుడ్ల చొప్పున అందిస్తోంది.



గోస్పాడు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్

గోస్పాడు మండలంలో..

పాఠశాలలు	సంఖ్య	విద్యార్థులు
ప్రాథమిక పాఠశాల	22	1604
ప్రాథమికోన్నత పాఠశాలలు	5	90
ఉన్నత పాఠశాలలు	3	2116
మోడల్ స్కూల్	-	201
కస్తూర్బా గాంధీ	-	498
మొత్తం	32	4257

విద్యార్థులకు అందించే మెనూ

సోమవారం : పొంగల్, ఉడికించిన గుడ్డు, కూరగాయల పలావ్, గుడ్డు కూర, చిక్కీ
మంగళవారం : పులిహోర, టమాట పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్లు, రాగి జావ
బుధవారం: వెజిటబుల్ బిర్యానీ, ఆలు కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కి
గురువారం : సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు
శుక్రవారం : కూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ, ఆకుకూర, సాంబారు
శనివారం: స్వీట్ పొంగలి, రాగిజావ

పాఠశాలలోనే భోజనం చేస్తా



మధ్యాహ్న భోజనం పథకం ద్వారా అందిస్తున్న ఆహార పదార్థాలు ఎంతో బాగున్నాయి. ప్రతి రోజు మధ్యాహ్న భోజనంతో వారంలో ఐదు రోజుల పాటు గుడ్డు అందిస్తున్నారు. మంచి రుచికరమైన ఆహార పదార్థాలు అందిస్తుండడంతో పాఠశాలలోనే భోజనాలు చేస్తున్నాం. పాఠశాలలో చిక్కీలు, రాగిజావ అందిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

–నాగచైతన్య, 8వ తరగతి, దీబగుంట్ల

పాఠశాలలో వసతులు బాగున్నాయి



ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడే అన్ని వసతులు కల్పించారు. గతంలో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఇంతంత మాత్రంగానే ఉండేది. ఇప్పుడు అందించే భోజనం ఎంతో రుచికరంగా ఉంటోంది. రోజుకో రకమైన ఆహార పదార్థాలు అందిస్తున్నారు. వీటితోపాటు విద్యార్థులకు అవసరమయ్యే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్, బ్యాగులు కూడా అందించడంతో మాకెంతో ఉపయోగపడుతున్నాయి.

–చంద్రమౌళి, 10వ తరగతి విద్యార్థి, గోస్పాడు

మెనూ ప్రకారం అందిస్తున్నాం

ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరు ముద్ద పథకాన్ని పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో కంటే మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలల్లో తినే విద్యార్థుల సంఖ్య పెరిగింది. రుచిగా.. సుచిగా వడ్డిస్తున్నారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలను అందిస్తున్నాం. అలాగే నాడు–నేడు పనులతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి.

–అబ్దుల్‌కరీమ్, ఎంఈఓ, నంద్యాల

అన్నదాతకు అండగా ప్రభుత్వ పథకాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల(సెంట్రల్): వ్యవసాయ రంగ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పలు పథకాలను రైతన్నలు సద్వినియోగం చేసుకుని మంచి దిగుబడులు సాధించాలని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ శాఖ, డీఆర్‌డీఏ, పరిశోధనా క్షేత్ర సిబ్బంది ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్ ఆక్వా ఎండీ ఉదయ్ కిషన్, సృష్టి గ్రోన్యూట్రియంట్స్ డైరక్టర్ సుబ్బరామరాజు, సుంకర సామిని, నెటాఫమ్ డ్రిప్ కంపెనీ ప్రతినిధి రమణారెడ్డి తదితరులు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ వల్ల ఎన్నో లాభాలున్నాయని తెలిపారు. పంట పోషకాలను అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. దిగుబడులకు విలువ జోడింపు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ రైతు సంఘాల ద్వారా నిర్వహించే విధానాలపై అవగాహన కల్పించారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ ఫెడరేషన్ ఛైర్మన్ కల్లూరి రామలింగారెడ్డి మాట్లాడుతూ.. ఆహారశుద్ధి విధానంలో ప్రభుత్వ పాలసీలను ఉపయోగించుకోవాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డీఏఓ మోహనరావు, ఏడీఏలు రాజశేఖర్, సుధాకర్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుంకన్న

నంద్యాల(న్యూటౌన్): పంటలకు గిట్టుబాటు ధర చట్టం, కార్మికులకు వేతనాల పెంపు, కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చి ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 16న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతుకు న్యాయం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని కోరారు. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా రైతు సంఘం కార్యదర్శి సోమన్న, బాలకృష్ణ, శ్రీనివాసులు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక



గఫ్ఫార్‌బాబాను అభినందిస్తున్న హెచ్‌ఎం

చాగలమర్రి: నంద్యాల పట్టణంలో ఈ నెల 11,12వ తేదీల్లో జరిగిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలో చాగలమర్రి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన గఫ్ఫార్ బాబా ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం ఎం.కోటయ్య తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 173 ప్రాజెక్టులను ప్రదర్శించగా గఫ్ఫార్‌బాబా తయారు చేసి ''యూజింగ్ స్మార్ట్ కార్డు'' ప్రథమ స్థానానికి ఎంపిక కావడంతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడన్నారు. విద్యార్థితో పాటు గైడ్‌గా పనిచేసిన సైన్సు ఉపాధ్యాయుడు శ్రీనివాసులును సన్మానించారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



పూజలందుకున్న కాళికాంబ అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలచే అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో, వివిధ రకాల పూలచే అలంకరించారు. అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం నిర్వహించి, 108 వెండి పుష్పాలచే అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్ కుమార్ తిమ్మయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

దేవరాయపురంలో ఉత్సవపల్లకీ



ఉత్సవపల్లకీపై లక్ష్మీనరసింహుడు

ఆళ్లగడ్డ: అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవ పల్లకీ దేవరాయపురంలో కొలువుదీరింది. ఉత్సవమూర్తులు శ్రీజ్వాలనరసింహ స్వామి, శ్రీప్రహ్లాదవరదస్వాములను మంగళవారం దేవరాయపురం గ్రామ వాసులు దర్శించుకున్నారు. అనంతరం స్వామివారిని ఊరేగించారు.

రేపటి నుంచి తిక్కస్వామి ఉరుసు

నంద్యాల వ్యవసాయం: పట్టణంలోని సాయిబాబా నగర్‌లో వెలసిన శ్రీహజరత్‌సయ్యద్‌షా షహన్‌షా అవులియా దస్తగిర్ ఖాదరి ఖుద్దూస (తిక్కస్వామి) ఉరుసు ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు జరుగుతాయని దర్గా ధర్మకర్త షేక్‌ఖలీలాబాష తెలిపారు. 15వ తేదీన గంధోత్సవం, 16వ తేదీ ఉరుసును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 17, 18, 19వ తేదీల్లో జాతర్లు నిర్వహిస్తామన్నారు. ఫాతేహాలు, పూలందడల సమర్పణ, గంధ సమర్పణ, అన్నదానం తదితర కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. 16వ తేదీ రాత్రి కవ్వాలి పోటీలు, 18న ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి
- పొదుపు మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ



రుద్రవరంలో పొదుపు మహిళలకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి





చాగలమర్రిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు, హాజరైన పొదుపు సంఘం సభ్యులు

చాగలమర్రి/రుద్రవరం: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చాగలమర్రి, రుద్రవరం మండలాల్లో ఏర్పాటు చేసిన 4వ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 4వ ఏడాది చాగలమర్రి మండలంలో 318 పొదుపు గ్రూపుల్లో 3,230 మంది సభ్యులకు రూ.1.64 కోట్లు మంజూరు చేయడం హర్షనీయమన్నారు. అలాగే రుద్రవరం మండలంలో 664 సంఘాలకు రూ.4,60,25,727 చెక్కును అందజేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్, సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే సంక్షేమ పథకాల నగదు జమచేశారని తెలిపారు. ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మహిళల కోసం అమ్మ ఒడి, చేయూత, ఆసరా తదితర ఎన్నో పథకాలు తీసుకొచ్చారని చెప్పారు. ఎన్నికలు దగ్గర పడడంతో ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఆయన సీఎంగా ఉన్న సమయంలో చెప్పుకోదగ్గ పథకం, అభివృద్ధి పని ఏం ఉందో చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. భూ కబ్జాలు, దోపిడీలు, కిడ్నాప్‌లు చేసే నాయకులు కావాలా? ప్రజల సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించే నాయకులు కావాలో వచ్చే ఎన్నికల్లో ప్రజలే నిర్ణయించుకోవాలని కోరారు. తాను ఎమ్మెల్యే అయ్యాక ఒక్క ఫ్యాక్షన్ కేసు నమోదు కాలేదన్నారు. నియోజకవర్గంలో 90 శాతానికిపైగా రోడ్లు వేశామని అన్నారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓలు సూర్యనారాయణరెడ్డి, రామచంద్ర, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ షేక్ బాబులాల్, ఎంపీపీ వీరభద్రుడు, జెడ్పీటీసీ మాధవి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, వెలుగు డీపీఎం దానం, ఏపీఎంలు నాగమ్మ, కల్పలత, మహిళా కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీబాలవిద్య, సర్పంచ్‌లు తులసమ్మ, బైరి విజయలక్ష్మి, బంగారు షరీఫ్, సరోజమ్మ, ప్రతాప్‌రెడ్డి, గోవిందయ్య, వెంకటసుబ్బారెడ్డి, మౌళిబాషా, సంజీవరాయుడు, ఎంపీటీసీలు లక్ష్మీరెడ్డి, పత్తి నారాయణ, ఫయాజ్, శేషు రమేష్, కుమార్‌రెడ్డి, ఖాదర్‌బాషా, తిమ్మయ్య, నగేష్, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు సిద్ధం సభను విజయవంతం చేద్దాం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహిస్తున్న సిద్ధం సభకు ఆళ్లగడ్డ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి కోరారు. సభకు సమాయత్తానికి చాగలమర్రి, రుద్రవరం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 18న నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉర్దూ మీడియంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. మంగళవారం సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న ఉర్దూ పుస్తకాలను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నంద్యాల జిల్లాలో 100 శాతం ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. రియాసతి ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు జమాన్, ప్రధాన కార్యదర్శి దస్తగిరి పాల్గొన్నారు.

నేడు భవనాల ప్రారంభోత్సవాలు

గోస్పాడు: మండల కేంద్రంలో సచివాలయం, స్త్రీశక్తి భవనాలను నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ నాగిరెడ్డి, ప్రహ్లాదరెడ్డి బుధవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ అనసూయ తెలిపారు. సచివాలయాన్ని రూ.35లక్షలతో, స్త్రీ శక్తి భవనాన్ని రూ.50 లక్షలతో ఆధునిక సౌకర్యాలతో నిర్మించినట్లు చెప్పారు.

ఖైదీలకు హెచ్‌ఐవీ పరీక్షలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సబ్ జైలులో సాతి ఎన్‌జీఓ సంస్థ ఆధ్వర్యంలో ఖైదీలకు మంగళవారం హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిజన్‌పీర్ మొబలైజర్ సుధాకర్ హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. సుమారు 40మంది ఖైదీలకు పరీక్షలు చేసినట్లు తెలిపారు. సబ్‌జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, వెంకటరమణ పాల్గొన్నారు.

యాత్ర–2 విజయవంతంపై సంబరాలు

నంద్యాల(న్యూటౌన్): వైఎస్సార్‌సీపీ నేతలు, కౌన్సిలర్ నన్నల సాయిరాంరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని గిరినాథ్ సెంటర్‌లో యాత్ర–2 సినిమా విజయవంతంపై మంగళవారం కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారని పార్టీ నాయకులు తెలిపారు. ఇప్పుడు ఆయన తనయుడు అన్నీవర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మన్ననలు అందుకుంటున్నారన్నారు.

మైనార్టీ భవన నిర్మాణాల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న సునీల్ కన్నా

నంద్యాల(అర్బన్): ప్రధాన మంత్రి జనవికాస్ కార్యక్రమంలో భాగంగా నిర్మాణ దశలో ఉన్న మైనార్టీ బాలికల వసతి గృహం, వర్కింగ్‌ఉమెన్స్ హాస్టల్, ఉర్దూ డిగ్రీ, కామన్ సర్వీస్ సెంటర్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఉమ్మడి కర్నూలు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సునీల్ కన్నా అన్నారు. మైనార్టీ సంక్షేమ అధికారిగా మంగళవారం బాధ్యతలు చేపట్టిన ఆయన కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పద్మజలను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పట్టణంలోని మూలసాగరంలో నిర్మాణ దశలో ఉన్న భవన నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

శరవేగంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు

ఉయ్యాలవాడ: మండలంలోని జగనన్న కాలనీల్లో పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ 76 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ రఘురామ్ తెలిపారు. మొత్తం 11 గ్రామ సచివాలయాల పరిధిలో 509 మంది లబ్ధిదారులకు చెందిన ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 385 మందికి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన 124 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేయించేందుకు గ్రామ కార్యదర్శుల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

కార్మికుల భద్రతే ధ్యేయం

నంద్యాల(సిటీ): కార్మికుల భద్రతే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం(నమస్తే) స్కీం పైలట్ ప్రాజెక్ట్‌ను స్వచ్ఛంద కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తుందని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం లక్ష్యాలు మురుగు, సెప్టిక్ ట్యాంక్ కార్మికుల జీవన భద్రత, మెరుగైన ఉపాధి కోసం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నామన్నారు. అంతే కాకుండా ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రెట్టింపు వైద్య సహాయం, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ ద్వారా జీవనోపాధి రుణాలు కార్మికుల పిల్లలకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు ఈ నెల 19వ తేదీలోగా నమస్తే పథకానికి వివరాలను మున్సిపాలిటీలో నమోదు చేసుకోవాలని తెలిపారు.